సాక్షి పల్నాడు

మంగళవారం । 2 । జూలై । 2024



వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: వేమవరంలోని కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.



కనుల పండువగా శ్రీవారి కల్యాణం

నరసరావుపేటఈస్ట్: శ్రీనివాసనగర్‌లోని గోదా పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు.



మేతగా మారిన మొక్కలు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిలో సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన మొక్కలు మేకలకు మేతగా మారాయి. అధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

న్యూస్‌రీల్

ఈ ఏడాది రుణ ప్రణాళిక రూ.18,369 కోట్లు



నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం 2024–25 సంవత్సరానికి రూ.18,369 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ ఆవిష్కరించారు. వార్షిక ప్రణాళికలో ప్రాధాన్యత రంగాలకు రూ.15,998 కోట్లు కేటాయించగా, వ్యవసాయ రంగానికి రూ.13,211 కోట్లు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు రూ.2,224కోట్లు కేటాయించారు. ఇతర రంగాలకు రూ.563 కోట్లు కేటాయించారు. గతేడాది వార్షిక రుణ ప్రణాళికను విజయవంతంగా అధిగమించినందుకు ఎల్‌డీఎం కేఎస్ రామప్రసాదు బ్యాంకర్లను అభినందించారు. ప్రస్తుత ఏడాది కూడా రుణ లక్ష్యాలను అధిగమించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో కలెక్టర్ తనిఖీలు



నరసరావుపేట: బురదమయంగా మారిన ఆర్టీసీ బస్టాండ్‌ను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మున్సిపల్, ఆర్టీసీ అధికారులతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్‌లో నీరు నిలబడేందుకు గల కారణాలను ఆర్టీసీ ప్రజా రవాణా జిల్లా అధికారి ఎన్.వి శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. బస్టాండ్‌లో నిల్చున్న మురుగుని తక్షణమే తొలగించి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిని ఆదేశించారు.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం


మాచర్ల: పల్నాడు జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, మాచర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జులై 25వ తేదీ మాచర్ల పట్టణంలోని ఐటీఐ కళాశాలలో సంప్రదిస్తే ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తామని తెలిపారు. జులై 27, 28 తేదీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు మాచర్ల పట్టణంలోని ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా చౌడేశ్వరి ఆలయ వార్షికోత్సవం



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం 16వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో చౌడేశ్వరి అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు పంచామృతాలతో అభిషేకం, 9 గంటలకు హోమం జరిపించారు. 10 గంటల నుంచి పెద్దసంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వేడుకలలో పాల్గొన్న వందలాది మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.10 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.00 అడుగుల వద్ద ఉంది.

ఒక్క క్లిక్‌తో ఎయిమ్స్

- 'ఈ– పరామర్శ' యాప్‌తో సులభంగా వైద్య సేవలు
- గ్రామీణ ప్రాంత రోగులకు అవగాహన కరువు
- యాప్ వైద్య సేవలపై మరింత ప్రచారం కలిగించాలంటున్న ప్రజలు



మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రి

మంగళగిరి: రాష్ట్రానికే తలమానికంగా, దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద ఆసుపత్రిగా మంగళగిరిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) విలసిల్లుతోంది. నిపుణులైన వైద్యులు, అధునాతన పరికరాలతో పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందడంతో రోగులు బారులు తీరుతున్నారు. రాష్ట్రంతో పాటు తెలంగాణ, చెన్నై, ఒడిస్సా రాష్ట్రాల నుంచి రోజుకు మూడు వేల మందికిపైగా రోగులు వస్తున్నారు.

రోగులకు తప్పని కష్టాలు

రోగులకు సులభతరంగా వైద్య సేవలందించేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఆస్పత్రిలో వసతుల గురించి రోగులకు అవగాహన కల్పించడంలో విఫలం చెందుతున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు కష్టాలు తప్పడం లేదు. సమస్యను గుర్తించిన ఎయిమ్స్ అధికారులు 'ఈ– పరామర్శ' యాప్ ద్వారా టెలీ మెడిసిన్ అందుబాటులోకి తెచ్చారు. నేరుగా వైద్యసేవలు అందని వారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒకసారి వైద్యం చేయించుకున్న వారు తర్వాత యాప్ ద్వారా వైద్య సేవలందుకునే అవకాశం ఉంది. అయితే, దీనిపై రోగులకు పెద్దగా అవగాహన లేక ఉపయోగించడం లేదు.

టెలీ కన్సల్టెన్సీ రిక్వెస్ట్ కోసం ..

టెలీ కన్సల్టెన్సీ మీద నొక్కితే రోగి వివరాలు కనిపిస్తాయి. జనరల్ మెడిషన్, దంత, నేత్ర, ఎముకలు ఇలా.. 12 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయి. రోగి ఏ విభాగం సేవలు కోరుకుంటే ఆ విభాగం జ్వరం, దగ్గు, ఇతర లక్షణాలు నమోదు చేయాల్సిందిగా అడుగుతుంది. ఆరోగ్య సమస్య ఏమిటని ఒక టేబుల్ వస్తుంది. దానిలో రోగి ఆరోగ్య సమస్య నమోదు చేయాలి. సంబంధిత వైద్య విభాగంలో స్లాట్ బుకింగ్‌లోకి వెళ్తాం. రోగికి కావాల్సిన తేదీని నమోదు చేయాలి. వారంలో సోమవారం నుంచి శుక్రవారం వరకు రోజు ఉదయం 8.30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య (శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు) వైద్యులు అందుబాటులోకి వచ్చి సలహాలు ఇస్తారు.

నేరుగా వచ్చే వారికీ ఉపయోగకరం

నేరుగా ఓపీకి వెళ్లి రూ 10 చెల్లించి సంబంధిత వైద్యుడితో పరీక్ష చేయించుకోవచ్చు. రక్త, ఇతర పరీక్షలు, స్కానింగ్, ఎక్సరే చేయించుకున్నాక సంబంధిత రిపోర్టులు యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. యాప్ ద్వారా వైద్యులకు ఆరోగ్య సమస్యలపై వివరించవచ్చు. వారు ఇచ్చే సలహాలను బట్టి వైద్యసేవల్ని పొందవచ్చు. నేరుగా ఎయిమ్స్‌కు వచ్చే రోగులు ఓపీ ఎంక్వయిరీతో పాటు యాప్‌లో ఏ వైద్యుడు ఎక్కడ సేవలందిస్తారనే వివరాలు, గది నంబర్ తెలుసుకోవచ్చు. ఓపీలో రూ. 10 చెల్లించాక వైద్యుడు రాసే పరీక్షల చార్జీలను వెంటనే తెలుసుకోవచ్చు. చేయించుకున్న పరీక్షల రిపోర్టులు మన మొబైల్ యాప్‌కు వస్తాయి. ఇదే యాప్‌లో కుటుంబసభ్యులకు సంబంధించి మరో వ్యక్తి పేరు యాడ్ చేసుకోవచ్చు. దీన్ని నొక్కితే ఈ మొబైల్‌లో యాడ్ అయిన కుటుంబ సభ్యులకు సంబంధించిన వైద్య వివరాలు తెలుస్తాయి.

విస్తృత అవగాహన అవసరం

అసలు చాలామందికి 'ఈ-పరామర్శ' యాప్ సౌకర్యం ఉన్నట్లు తెలియదు. 'ఎయిమ్స్ వైద్య సేవలు కోరుకుంటున్నారా ? అయితే ఆ యాప్ ఎంతో ఉపయోగపడుతుంద'ని ఎయిమ్స్ అధికారులు సలహా ఇస్తున్నా ప్రయోజనం ఉండటం లేదు. గ్రామ ప్రాంతాల నుంచి అధికంగా వస్తున్న రోగులు నిరక్షరాస్యులు కావడంతో యాప్‌పై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు మరింత అవగాహన కల్పించి, విస్తృతంగా ప్రచారం కల్పించాలని రోగులు కోరుతున్నారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకునే పద్ధతి

గుగూల్ ప్లే స్టోర్‌లో ఎయిమ్స్ మంగళగిరి అని సెర్చ్ చేసి 'ఈ–పరామర్శ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గెట్ స్టార్టెడ్ క్లిక్ చేయాలి.లాగిన్ పేషంట్ లేదా డాక్టర్ అని ఆప్షన్స్ వస్తాయి. రోగి తన ఫోన్ నంబర్ నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. లాగిన్ అయ్యాక రోగి తండ్రి పేరు వయస్సు, పురుషుడు లేదా స్త్రీ చిరునామా మెయిల్ ఐడీ ఇవ్వాలి. రిజిస్టర్ బటన్ నొక్కితే యాప్‌లో లాగిన్ అవుతారు.



అర్జీలకు ఉత్తమ పరిష్కారం చూపండి

- కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 76 అర్జీలు స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్, జేసీ ఎ.శ్యాంప్రసాద్

నరసరావుపేట: అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి లత్కర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారం వేదిక(మీకోసం)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై 76 అర్జీలు అందజేశారు. కలెక్టర్‌తోపాటు జేసీ ఏ.శ్యాంప్రసాదు, డీఆర్వో కె.వినాయకం అర్జీలను స్వీకరించారు.

జీతాలు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

ఆరు నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదు. కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. జీతాలు ఇప్పించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

– సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు

ఐదేళ్లకు ఒకసారి ఆస్తిపన్ను పెంచాలి

గత ప్రభుత్వం ప్రతి ఏడాదీ 15 శాతం ఆస్తిపన్ను పెంచుకునేలా పురపాలక సంఘాలకు అవకాశం ఇవ్వటం ద్వారా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడ్డారని, అందువలన ప్రతి ఐదేళ్లకు ఒకసారి పన్నులు పెంచేలా ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలి. దీని వలన పేద, మధ్యతరగతి ప్రజలకపై ఆర్థిక భారం పడకుండా ఉంటుంది.

–కుంచాల స్వామి, పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు

కొడుకులు తిండిపెట్టడం లేదయ్యా...



నాకు మొదటి భార్య ద్వారా ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. 30 ఏళ్ల కిందట మొదటి భార్య చనిపోతే రెండో భార్యగా అంజమ్మను వివాహం చేసుకున్నా. ఆమె ద్వారా నాకు పిల్లలు లేరు. పిల్లలందరికి వివాహాలు చేశా. నాకు సొంత ఇల్లు, రెండెకరాల పొలం ఉంది. పిల్లల బలవంతంపై ఆ రెండెకరాలను చెరో ఎకరం రాశా. ఇప్పుడు కోడళ్లు కనీసం తిండి కూడా పెట్టడం లేదు. గట్టిగా అడిగితే గొంతు పట్టుకొని మీ చావు మీరు చావండని కొట్టబోతున్నారు. 75 ఏళ్ల వయస్సులో ఇప్పుడేం చేస్తాం. ఏవిధంగానైనా మాకు తిండిపెట్టే విధంగా చూడాలి.

–గంటా శివయ్య, అంజమ్మ, ఒప్పిచర్ల

కొత్త క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

చీరాలలో న్యాయవాదులు విధుల బహిష్కరణ

చీరాలరూరల్: ప్రజా వ్యతిరేక క్రిమినల్ చట్టాలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుత పాలక ప్రభుత్వం నిలిపివేయాలని కోరుతూ సోమవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాదుల సంఘం రాష్ట్ర నాయకుడు బూదరాజు శశికిరణ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా, నిరంకుశంగా వ్యవహరించి మూడు క్రిమినల్ కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కొత్త చట్టాలన్నీ పోలీసులకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. కొత్త చట్టాల రూపకల్పనలో న్యాయ పండితులు, న్యాయ కోవిదులు, మేధావి వర్గం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సలహాలను తీసుకోకుండా ఇష్టానుసారంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒంటెద్దుపోకడలు పోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం రామకృష్ణ

జీఎస్టీతో బలమైన ఆర్థిక శక్తిగా భారత్

- గుంటూరు డీఆర్‌ఎం రామకృష్ణ
- ఘనంగా జీఎస్టీ వేడుకలు

లక్ష్మీపురం:జీఎస్టీ అమలుతో భారత ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకుంటుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసరావుపేటలోని టుబాకో అసోసియేషన్ హాలులో సోమవారం 8వ జీఎస్టీ దినోత్సవాన్ని కమిషనర్ సాధు నరసింహారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద సంస్కరణ జీఎస్టీయేనని, దీనివల్ల పన్నుల రంగంలో భారీ మార్పులు వచ్చాయని తెలిపారు. పన్నుల వ్యవస్థ పూర్తిగా చక్కబడిందన్నారు. బిడ్డ ఎదుగుదలకు తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమో, జీఎస్టీ కూడా దేశ ఆర్థికాభివృద్ధికి అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఉద్యోగులంతా కొంత సమయాన్ని ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని ఆయన సూచించారు. నిత్యం 45 నిమిషాల పాటు యోగా, వ్యాయామం లేదా నడవాలని తెలిపారు.

- టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలకు ఉత్తరాఖండ్ స్టేట్ నుంచి తాను పాల్గొన్నానని తెలిపారు. జులై 1, 2017నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అన్ని టాక్స్‌లు కలిపితేనే జీఎస్టీ వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా చెల్లిస్తూ దేశ పురోభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. స్టేట్, సెంట్రల్ జీఎస్టీ అధికారులు పరస్పర సహకారంతో పని చేయాలని ఆయన సూచించారు.
- సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఏడేళ్లలో వసూళ్ల గణనీయమైన వృద్ధి సాధించాయని తెలపారు. దేశంలో ప్రారంభ మైన తొలి నెలలో వసూళ్లు రూ.93 వేల కోట్లు కాగా, ఇప్పుడు రూ. 2.10 లక్షల కోట్లకు చేరిందన్నారు.
- గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్‌లో గత ఆర్థిక సంవత్సరంలో రూ.403 కోట్లు ఎగవేతను గుర్తిస్తే దానిలో రూ.280 కోట్లు వసూలు చేశామని చెప్పారు. 2023–24లో గుంటూరుకు రూ.7 వేల కోట్లు ఆదాయం లభించిందని వెల్లడించారు.

అనంతరం ప్రభుత్వానికి అత్యధిక జీఎస్టీని చెల్లించిన పలువురికి టాప్ టాక్స్ పేయర్స్ సర్టిఫికెట్‌లను అందజేశారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభను చూపిన ఉద్యోగులకు, సోషల్ వర్కర్లకు, ఆరోగ్య వీరులకు (హెల్త్ హీరోస్) ప్రశంసా పత్రాల్ని బహూకరించారు. జీఎస్టీ శాఖలో ఎనలేని సేవల్ని అందించిన విశ్రాంత ఉద్యోగుల్ని ఘనంగా సత్కరించారు. రాష్ట్రపతి అవార్డు పొందిన విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ వీరవల్లి అంకినీడు ప్రసాద్‌ను ప్రత్యేక ఆహ్వానితునిగా సత్కరించి, జ్ఞాపికను అందించారు. క్రీడలలో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు, వారి పిల్లలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సెంట్రల్ జీఎస్టీ అడిషనల్ కమిషనర్ జి.రామకృష్ణరాజు యాదవ్, జాయింట్ కమిషనర్ ఉపేంద్రకుమార్ ధృవ్, అసిస్టెంట్ కమిషనర్లు రవికుమార్, నాగరాజు, సీతారామరాజు, సూపరింటెండెంట్లు గాదే శ్రీనివాసరెడ్డి, టీవీజీకె మూర్తి, యుగంధర్, నవీన్ రాజు, ఈశ్వరరావు, చిట్టి, గద్దె లిలక్, టి.వివేకానంద పాల్గొన్నారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ఆధ్వర్యంలో గత జూన్‌లో జరిగిన దూరవిద్య టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఏపీ ఓపెన్ స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో సందర్శించాలని సూచించారు. గుంటూరు జిల్లాలో దూరవిద్య టెన్త్ పరీక్షలకు హాజరైన 779 మంది అభ్యర్థుల్లో 658 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన 1,224 మంది అభ్యర్థుల్లో 996 మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. సంబంధిత అభ్యర్థులు మార్కుల జాబితాలను ఏపీఓపెన్ స్కూల్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె సూచించారు. రీ–కౌంటింగ్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.200, రీ–వెరిఫికేషన్ కోసం ప్రతి సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున ఈనెల 13లోపు ఆన్‌లైన్‌లో పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- అధికార పార్టీ దాడుల సంస్కృతి మానుకోవాలి
- ఓట్లు వేసిన ప్రజలకు అభివృద్ధి చేయాలి దాడులు కాదు



వినుకొండ(నూజెండ్ల): అసెంబ్లీ ఎన్నికల్లో తనకు లక్షకు పైచిలుకు ఓట్లు వేసిన ఓటర్ల రుణం తీర్చుకుంటానని, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా, అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్నికల అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని తాను పార్టీలో కార్యకర్తగా మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ తరపున భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు.

టీడీపీ దాడుల సంస్కృతి మానుకోవాలి:

అధికార టీడీపీ నాయకులు తమ పార్టీ కార్యకర్తలపై దాడులు ఆపాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం, తమ హయాంలో వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం, వైఎస్సార్ విగ్రహాలు పగులగొట్టడం మంచి సంస్కృతి కాదన్నారు. తమ పరిపాలనా కాలంలో ఎక్కడా ఇలాంటి దాడులు చేయలేదని గుర్తు చేశారు.

ప్రజాపాలన అందించాలి

ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారం ఇచ్చిన ప్రజలకు మంచి పనులు చేయాలని, వినుకొండను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు సూచించారు. గతంలో వినుకొండలో షాపింగ్ కాంప్లెక్స్, 100 పడకల ఆస్పత్రి, ముస్లిం షాదీఖానా, కళాశాల, కూరగాయలమార్కెట్ షాపులు వంటి నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అన్నీ రకాల అనుమతులు ప్రభుత్వం ఇచ్చిందని మున్సిపల్ తీర్మానాలు కూడా చేశారని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందించాలని, లేనిపక్షంతో చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. వినుకొండ ప్రజలకు సురక్షితమైన తాగునీరు ఇవ్వాలని అన్నారు. వినుకొండ ప్రజలకు అభివృద్ధి విషయంలో అండగా ఉంటానని చెప్పారు. ఎన్నికలకు ముందు జరిగిన గొడవలకు సంబంధం లేని వ్యక్తులను కూడా కేసుల్లో ఇరికించి ఇప్పుడు కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్వగ్రామం ఈపూరు మండలం ఇనిమెళ్లలో గోనుగుంట్ల వెంకట హనుమయ్యపై ఇప్పుడు కేసులు మోదు చేయడం దారుణమన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచిచేయాలని చేతనైతే వినుకొండను ఇంకా పోటీపడి అభివృద్ధి చేయాలన్నారు. ఇలా గొడవలు సంస్కృతికి మంచిది కాదన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

కారులో భారీగా వెండి తరలింపు

- పోలీసుల తనిఖీల్లో పట్టివేత
- రూ.23 లక్షల విలువైన వెండి వస్తువులు
- బిల్లులు లేనందున రూ.1.38 లక్షల అపరాధ రుసుం విధింపు

చిలకలూరిపేటటౌన్: ఎలాంటి బిల్లులు లేకుండా కారులో తరలిస్తున్న 36 కేజీల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని జిల్లా వాణిజ్య పన్నులశాఖకు అప్పగించారు. చిలకలూరిపేటలో జరిగిన ఈ సంఘటనపై సోమవారం అర్బన్ పోలీసులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ పి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో వాహనాల సాధారణ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి మార్కాపురం వెళ్తున్న ఓ కారులో అనుమానాస్పదంగా మూడు బ్యాగులు కనిపించాయి. వాటిని సోదా చేయగా రూ.23,04,000 విలువైన 6 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటికి సరైన బిల్లులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా వస్తువుల్ని వ్యాపార నిమిత్తం మార్కాపురం నెహ్రూనగర్‌లో స్థిరపడిన రాజస్థాన్ వాసులు అర్జున్‌సింగ్, సూర్‌సింగ్, విక్రమ్‌సింగ్ వీటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. సరైన బిల్లులు లేని కారణంగా వెంటనే జిల్లా వాణిజ్య పన్నుశాఖ అధికారులకు సమాచారం అందించి, తనిఖీల్లో పట్టుబడిన వెండిని అప్పగించారు. ఎలాంటి బిల్లులు లేనందున రూ.1,38,240 అపరాధ రుసుం చెల్లించి తమ వస్తువుల్ని తీసుకెళ్లాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారి మల్లికార్జున్ ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ పి రమేష్, ఎస్ఐ ఎస్ సుమన్, సిబ్బంది ఉన్నారు.

జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి

యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ప్రాథమిక విద్యా వ్యవస్థకు ప్రతిబంధకంగా మారిన 117 జీవోను రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియానికి సమాంతరంగా ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆ జీఓ అమలు వలన గ్రామాల్లో 3,4,5 తరగతుల లేకుండా పోయినట్లు చెప్పారు. ఎక్కువ మంది డ్రాప్‌ఔట్స్‌గా మారారన్నారు. 70 శాతం ప్రాథమిక పాఠశాలలు 1,2 తరగతులకు మాత్రమే పరిమితమయ్యాయని, అవి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారినట్లు పేర్కొన్నారు. నాడు నారా లోకేష్ అధికారంలోకి రాగానే 117 జీవో రద్దు చేస్తామన్న విషయాన్ని గుర్తుచేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు కేటాయించాలన్నారు. హైస్కూల్ ప్లస్ ఏర్పాటుచేసిన చోట ఇంటర్ క్లాసులు బోధించేందుకు అవసరమైన పోస్టులు మంజూరు చేయాలని కోరారు. ప్రమోషన్ల ద్వారా ఆ ఖాళీలను భర్తీ చేసే వరకు పని సర్దుబాటు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ సారథి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సంఘం స్వర్ణోత్సవ వేడుకలు కాకినాడలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నరసరావుపేటలో యూటీఎఫ్ జిల్లా కార్యాలయం నిర్మించేందుకు విరాళాలు ప్రకటించాలని కోరారు. సమావేశాన్ని జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు పర్యవేక్షించగా సమావేశం ప్రారంభంలో సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని, పోతులూరయ్య యుటీఎఫ్ పతాకావిష్కరణ చేశారు. కిషోర్ కుమార్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

క్లుప్తంగా

టేకు చెట్ల నరికివేత నిందితులు అరెస్ట్

ముప్పాళ్ల: ముప్పాళ్లలోని వ్యవసాయ భూమిలో టేకుచెట్లను అక్రమంగా నరికి అమ్మకం జరిపిన నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటనాగకోటేశ్వరరావుకు చెందిన వ్యవసాయ భూమిలోని పది టేకు చెట్లను నరికి ట్రాక్టర్‌ల ద్వారా తరలించిన సంగతి తెలిసిందే. రైతు ఫిర్యాదు మేర కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో మొత్తం తొమ్మిది మంది ఈ వ్యవహారంలో పాల్గొన్నట్లు నిర్ధారించుకొని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నరికిన దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి నలుగురిని అదుపులోకి తీసుకొని సత్తెనపల్లిలోని కోర్టుకు హాజరుపరిచినట్లు రూరల్‌సీఐ ఎం.రాంబాబు తెలిపారు. మిగిలిన వారంతా పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కంతేరు సర్పంచ్ మహేష్ మృతి



మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు వద్ద సోమవారం ఉదయం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన బెజ్జం మహేష్(45) మృతి చెందారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహేష్ భార్యాపిల్లలతో కలసి హనుమాన్ జంక్షన్‌కు కారులో బయల్దేరారు. భార్య అక్కడ సచివాలయ ఉద్యోగిగా పని చేస్తోంది. మహేష్ నడుపుతున్న కారు అదుపు తప్పి ఎదురుగా వెళుతున్న లారీని ఢీకొట్టి, బోల్తా పడింది. మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా భార్యాపిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఎయిమ్స్ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కాంగ్రెస్ పార్టీ పట్ల పూర్తి అంకితభావంతో పనిచేసిన మహేష్ ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పేరేచర్ల మస్తానవలి, తాడికొండ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు ఉన్నారు.

వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానంటూ మోసం

- పోలీసుల ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 46 ఫిర్యాదులు
- స్వీకరించిన జిల్లా ఎస్పీ మలికా గార్గ్



జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ మలికా గార్గ్

నరసరావుపేట: మండలంలోని గోనెపూడి గ్రామ సచివాలయ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనిల్ కుమార్ వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని రూ.67లక్షలు తీసుకొని తమను మోసం చేశాడని వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు జిల్లా ఎస్పీ అధ్యక్షత వహించి పలువురి నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు సంబంధించిన 46 ఫిర్యాదులు స్వీకరించారు.

మామ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు

నేను చక్రపాలెంకు చెందిన మోహననాయక్‌ను వివాహం చేసుకున్నాను. మామ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోండి.

–ఓ మహిళ, లాలిపురం, బొల్లాపల్లి మండలం

తండ్రిని కొట్టిన వారిని అరెస్టు చేయండి

గ్రామంలో చర్చి నిర్మాణానికి సంబంధించి తన తండ్రి సుందరరావుపై కొందరు వ్యక్తులు దాడిచేసి గాయపర్చారు. వారిపై పోలీసులకు ఫిర్యాదుచేసినా నమోదుచేయలేదు. ఎఫ్ఐఆర్ చేసి వెంటనే నిందితులను అరెస్టు చేయండి.

–మద్దూరి పౌలు, కారుచోల, యడ్లపాడు మండలం

ఇంట్లో చోరీ జరిగినా కేసు నమోదు చేయలేదు

తన ఇంట్లో జనవరి 24వ తేదీన చోరీ జరిగి రూ.1.85లక్షల నగదు, పది సెవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, దీనిపై అప్పుడే రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేసినా కేసు నమోదుచేయలేదని, ఇప్పటివరకు నిందితులను పట్టుకోలేదు, చోరీ సొత్తు అప్పగించలేదు.

యక్కంటి వెంకటేశ్వర్లు, అల్లూరివారిపాలెం, నరసరావుపేట మండలం

అమరేశ్వరుని భూ సమస్యలు పరిష్కరించండి

తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఆలయ ఈఓ వినతి



తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ ఈఓ

అమరావతి: తెలంగాణలో ఉన్న అమరావతి అమరేశ్వరస్వామి వారి భూసమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఖమ్మం జిల్లా మధిరలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించిన అనంతరం ఈఓ మాట్లాడుతూ అమరేశ్వర దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో సుమారు 415 ఎకరాల మెట్ట భూములు ఉన్నాయన్నారు. భూములకు కౌలు వేలం నిర్వహించటానికి ఉన్న సమస్యలు పరిష్కరించటానికి సహకారం అందించాలని కోరారు. ఎంతో కాలంగా ఎకరా ఒక్కింటికి వెయ్యి రూపాయలు చొప్పున రైతులు కౌలు చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం చుట్టుప్రక్కల కౌలు ఎక్కువగా ఉన్నందున, ఇప్పటివరకు భూములు కౌలు బహిరంగ వేలం పాటలు జరపని విషయాన్ని ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం మూడేళ్లకు బహిరంగ వేలం నిర్వహించేందుకు సహాయ సహకారాలు కోరగా అందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. దేవస్థానంనకు చెందిన సుమారు 20 ఎకరాల భూమి ఖమ్మం- హైదరాబాద్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకి భూ సేకరణ నిమిత్తం ఉన్నందున పరిహారం విషయంలో కూడా సహకరిస్తానని హామీ ఇచ్చారన్నారు. అమరేశ్వరస్వామి వారి దేవస్థానం తరపున వేద పండితులచే ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు వేద ఆశీర్వచనం అందించి, స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదం అందించామన్నారు.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను గుంటూరు–విజయవాడ మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం వెల్లడించారు. రైలు నంబర్ 17329 (హుబ్లి–విజయవాడ) ఈనెల 15నుంచి 31వరకు, 17330 (విజయవాడ–హుబ్లి) ఈనెల 16 నుంచి ఆగస్టు 1వరకు, 17282 (నరసాపూర్–గుంటూరు), 17281 (గుంటూరు–నరసాపూర్) ఈనెల 1నుంచి 31వరకు రద్దు చేసినట్లు వివరించారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు వేధింపులు

స్వచ్ఛందంగా తప్పుకోవాలని టీడీపీ నాయకుల బెదిరింపులు



కనపర్రు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

నాదెండ్ల: కనపర్రులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు వేధింపులు మొదలయ్యాయి. గ్రామంలో ఎనిమిది అంగన్‌వాడీ సెంటర్లున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అంగన్‌వాడీ సెంటర్లకు టీడీపీ కార్యకర్తలు వెళ్లి మీరు విధుల నుంచి తప్పుకోండి, మా మనుషులను నియమించుకుంటామంటూ గ్రామంలోని బీసీ, ఎస్సీ సెంటర్లలో సోమవారం బెదిరింపులకు దిగారు. మీరు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలను బయటకు పంపారు. దీంతో అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేస్తున్న కార్యకర్తలు వాపోయారు. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదని, తమను తప్పుకోవాలని హెచ్చరించటం అన్యాయమన్నారు. దీనిపై ఉన్నతాధికారులతో పాటూ తమ యూనియన్ నాయకులకూ తెలియజేస్తామని వాపోయారు.

ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారం ప్రదానం



చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

తెనాలి: ప్రఖ్యాత రంగస్థల నటుడు ఆంధ్ర గానకోకిల ఏవీ సబ్బారావు తన పద్యగానంతో దశాబ్దాలపాటు నాటక అభిమానులను అలరించారని ప్రముఖ సాహితీవేత్త మన్నె శ్రీనివాసరావు కొనియాడారు. ఆయన కళావారసత్వాన్ని తర్వాతి రెండు తరాలు కొనసాగించటం, ప్రేక్షకుల ఆదరణ పొందటం అదృష్టమన్నారు. ఏవీ సుబ్బారావ 94వ జయంతి వేడుకలు, ఏవీ సుబ్బారావు 13వ రంగస్థల పురస్కార ప్రదానోత్సవాన్ని సోమవారం సాయంత్రం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు మన్నె శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు, నంది అవార్డు గ్రహీత చింతలపూడి చెంచయ్యకు ఏవీ సుబ్బారావు రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. శాలు, గజమాలతో సత్కరించి అవార్డును, జ్ఞాపికను బహూకరించారు. గత నాలుగు దశాబ్దాలుగా ఏవీ సుబ్బారావు, ఆయన తనయులు, మనవడికి సంగీత సహకారాన్ని అందిస్తున్న ప్రముఖ రంగస్థల సంగీత దర్శకుడు చింతలపూడి చెంచయ్యకు అవార్డు ప్రదానం సముచితమని వక్తలు ప్రశంసించారు. ఏవీ సుబ్బారావు రంగస్థల సమాఖ్యకు చెందిన శ్రీపూర్ణశ్రీ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్రానికి చెందిన ప్రసిద్ధ కళాకారులు ఆచంట బాలాజీనాయుడు, గుమ్మడి జీవన్‌కుమార్, కె.వనజకుమారి, సాకె మల్లికార్జునరావు, రత్నశ్రీ, డీఎస్పీ రావు, ఎ.రామదాసు, ఎస్‌కే బా, మోడి ఆంజనేయులు, బీపీ మోహనరావు, చింతలపూడి చంద్రశేఖరరావు, పాతూరి సుబ్రహ్మణ్యం, ధర్మరాజు, బి.శివశంకర్ పాల్గొన్నారు. ఏవీ సుబ్బారావు జయంతి ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం 2 గంటల్నుంచి పలు పౌరాణిక పద్యనాటకాల్లోని సన్నివేశాలను ప్రదర్శించారు. పాండవోద్యోగం(కర్ణసందేశం), శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధ సీను), చింతామణి(ప్రేమ సన్నివేశం), గయోపాఖ్యానం (యుద్ధసీను) ప్రదర్శించారు. వల్లూరు శ్రీహరిరావు– టీవీఎస్ శర్మ, ఆరాధ్యుల నాగరాజు–జి.పైడిరాజు, ఆరాధ్యుల ఆదినారాయణ–రత్నశ్రీ, ధూపం తిరుమలతేజ–ధూపం రామకృష్ణ నటించారు. ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, నాగరాజు పర్యవేక్షించారు.

సీఎం చంద్రబాబుతో రైల్వే జీఎం అరుణకుమార్ జైన్ భేటీ

- రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులపై చర్చ
- గుంటూరు డివిజన్ అధికారులతో సమీక్ష



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

లక్ష్మీపురం: వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సోమవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి చర్చించారు. ముఖ్యమంత్రితోపాటు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ, విజయవాడ డివిజన్ డీఆర్ఎం నరేంద్ర, ఎ.పాటిల్ ఉన్నారు. అక్కడ నుంచి గుంటూరు డివిజనల్ మేనేజర్ కార్యాలయానికి విచ్చేయడంతో డివిజన్ అధికారులు, డీఆర్ఎం, ఏడీఆర్ఎం తదితరులు ఘన స్వాగతం పలికారు. డివిజన్ కార్యాలయంలో డివిజన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానంగా రైల్వే శాఖకు లోకో పైలట్లు ఫ్రంట్ లైన్ సిబ్బంది పాత్ర చాలా ముఖ్యమైనదని వివరించారు. చాలా పెద్ద బాధ్యత వహిస్తారని చెప్పారు. నిబంధనల ప్రాముఖ్యతను కూడా జీఎం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయాల్సిందిగా ఆదేశించారు. ఆదాయాన్ని మరింత పెంచడానికి తీసుకోవాల్సిన నూతన ఆధునిక పద్ధతిలో ఆలోచన చేయాల్సిందిగా కోరారు. రికార్డు స్థాయిలో దక్షిణ మధ్య రైల్వే ఉండాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీఆర్ఎం ఎం.రామకృష్ణ, డివిజన్ ఏడీఆర్ఎం సైమన్స్‌పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీల్లో రేష్మికి కాంస్య పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల చండీగఢ్‌లోని పంచకులలో జరిగిన 63వ జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో జావెలిన్ త్రో విభాగంలో గుంటూరుకు చెందిన రేష్మి కాంస్య పతకం సాధించిందని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈవెంట్‌లో 52.39 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానం పొందిందని పేర్కొన్నారు. ఇప్పటికే రేష్మి ఖాతాల్లో అనేక జాతీయ పతకాలు చేరాయన్నారు. ఈ సందర్భంగా రేష్మికి ఏపీసీ కార్యదర్శి జి.ఉషా నాయుడు, స్పోర్ట్స్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ ఎం.శివకుమార్, టి.అరుణ్‌కుమార్ అభినందనలు తెలిపినట్లు తెలియజేశారు.

డెంగీ, డయేరియా రాకుండా శుభ్రత పాటించాలి

- కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్
- అవగాహన ర్యాలీ



డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్

నరసరావుపేట: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవటం ద్వారా డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం నుంచి ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ డాక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది తమ విధులు బాధ్యతగా నిర్వహించి డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రజలకు రాకుండా ముఖ్యపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, ప్రభుత్వ హాస్పిటల్ల పర్యవేక్షణ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి గల్లంతైన విద్యార్థి మృతి



దుర్గా ప్రవీణ్ (ఫైల్)

సత్తెనపల్లి: స్నేహితులతో కలసి సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన సత్తెనపల్లిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన తాపీ పనులు చేసే గుంజి రాంబాబు, తిరుపతమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు గుంజి దుర్గాప్రవీణ్ (10) పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో మరో ముగ్గురు స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు పట్టణంలోని తారకరామాసాగర్‌కు వెళ్లారు. నలుగురు ఈతకొట్టేందుకు తారక రామా సాగర్ చెరువులోకి దిగగా ముగ్గురు మాత్రమే బయటికి వచ్చారు. దుర్గాప్రవీణ్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ముగ్గురు స్నేహితులు తిరిగి తమ ఇళ్లకు వెళ్లిపోయారు. కుమారుడు ఇంటికి రాకపోవడంతో గుంజి రాంబాబు పలుచోట్ల ఆరా తీశాడు. అయినప్పటికీ ఎక్కడా సమాచారం లభించలేదు. తమ కుమారుడు దుర్గాప్రవీణ్ వెంట వెళ్లిన స్నేహితుల ఇళ్ల వద్దకు వెళ్లి సోమవారం ఉదయం ఆరా తీయగా .. నలుగురం కలసి ఈత కొట్టేందుకు తారకరామసాగర్ చెరువులో దిగామని దుర్గాప్రవీణ్ ఒడ్డుకు రాకపోవడంతో కొద్ది సేపు చూసి తిరిగి వచ్చేశామని స్నేహితులు తెలిపారు. దీనిపై గుంజి రాంబాబు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు, పోలీసులు, మృతుడి తండ్రి గుంజి రాంబాబు తారక రామాసాగర్ వద్దకు చేరుకున్నారు. చెరువులో వెతుకులాట ప్రారంభించగా దుర్గా ప్రవీణ్ మృతదేహం లభించింది. దుర్గా ప్రవీణ్ మృతదేహానికి పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అందించారు. పట్టణ ఎస్ఐ ఎం సంధ్యారాణి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు ఇక లేడన్న వార్త తెలియడంతో మృతుడి తల్లిదండ్రులు తిరుపతమ్మ, రాంబాబు, సోదరి, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. వారి రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

శేష జీవితం ఆనందంగా గడవాలి

- జిల్లాలో ఏడుగురు పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ
- ఆత్మీయ వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ, పోలీసులు



జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌తో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు

నరసరావుపేట: పోలీసు విభాగం ద్వారా నిత్యం ప్రజాసేవ చేసి ఉద్యోగ విరమణ పొందిన వారందరూ శేష జీవితం కుటుంబ సభ్యుల మధ్య సుఖ సంతోషాలతో గడవాలని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆకాంక్షించారు. జిల్లా పరిధిలో సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి గత నెల 30న ఉద్యోగ విరమణ చేసిన ఏడుగురు పోలీసు అధికారుల వీడ్కోలు సమావేశం జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పాల్గొని ప్రతి ఒక్కరిని పేరుపేరున అభినందిస్తూ సత్కరించి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి, అంకితభావంతో పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించినందుకు అభినందించారు. ఉద్యోగ విరమణ పొంది సన్మానం పొందిన వారిలో డీసీఆర్‌బీ ఎస్ఐ సీహెచ్.వీరాంజనేయులు, సత్తెనపల్లి పట్టణ పోలీసుస్టేషన్ ఏఎస్ఐ ఎం.రామ్మోహనరావు, ఐనవోలు పోలీసుస్టేషన్ ఏఎస్ఐ ఎం.చెంచయ్య, ఏఆర్ ఎస్ఐ వై.భాస్కరరావు, చిలకలూరిపేట పట్టణ పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు మొఘల్‌నాయబ్ రసూల్, పఠాన్‌నుల్లాఖాన్ ఉన్నారు. కార్యక్రమంలో క్రైం అదనపు ఎస్పీ ఏఆర్ లక్ష్మీపతి, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఎస్‌బీ సీఐ బి.సురేష్‌బాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఏవో కేవీడీ రామారావు, వెల్ఫేర్ ఆర్ఐ గోపినాథ్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు బి.మాణిక్యాలరావు, అధికారులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగులతో అప్రమత్తం

జిల్లా వ్యవసాయాధికారి మురళి



మొలక దశలో ఉన్న పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: పత్తి పంట మొలక దశలో మొక్కపై రసం పీల్చే పురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, రైతులు వాటిని గమనించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. మండలంలోని కోనూరులో సోమవారం ఆయన మొలక దశలో ఉన్న పత్తి పంటను పరిశీలించారు. మురళి మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల నివారణకు 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్‌ను లీటరు నీటిలో కలపి మొక్క బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. పత్తి వేసిన 15 నుంచి 30 రోజుల వ్యవధిలో మోనోక్రోటాఫాస్, నీరు 1:4 నిష్పత్తిలోను, 45 రోజుల వ్యవధిలో ఇమిడాక్లోప్రిడ్ 1:10 నిష్పత్తిలో కలపి కాండం పూతగా రాసినట్లయితే రసం పీల్చు పురుగుల ఉధృతి సమూలంగా నశిస్తుందని చెప్పారు. ఏడీఏ వి.హనుమంతరావు మాట్లాడుతూ పత్తి, మిర్చి పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు కంది, మినుము, పెసర లాంటి పంటలు చేసుకున్నట్లయితే తక్కువ సమయంలో ఎక్కువ ఫలసాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.వెంకటేశర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బంది మాన్యనాయక్, ఇనోష్, షరీఫ్, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

అంబేడ్కర్ మనవడు భీమ్‌రావ్ యశ్వంతరావ్



సభలో మాట్లాడుతున్న భీమ్‌రావ్ యశ్వంతరావ్

పాత బొమ్ముువానిపాలెం(కొల్లిపర): అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ వాటిని ముందుకు తీసుకెళ్లాలని ఆయన మనవడు, గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంతరావ్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మండలంలోని పాత బొమ్మువానిపాలెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దళితులు, ఆదివాసీలకు మాత్రమే నాయకుడు కాదని, దేశంలోని ప్రతి పౌరుడికీ, హక్కులు కావాలనే ప్రతి ఒక్కరికీ నాయకుడేనని తెలిపారు. పాత బొమ్మువానిపాలెంలో విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహ ఆవిష్కరణకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నేటి యువత డీజేలు, ఇతర వాటికి బానిసలుగా మారారని విమర్శించారు. నిజమైన అంబేడ్కర్ అభిమానులు డీజేలకు దూరంగా ఉండాలని సూచించారు. తొలుత యువత, అంబేడ్కర్ అభిమానులు ముఖ్య అతిథుల్ని దావులూరు అడ్డరోడ్డు నుంచి సభా ప్రాంగణం వరకు జై భీమ్ నినాదాలతో, బైకు ర్యాలీతో తీసుకు వచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అంబేడ్కర్ అభిమానులు, యువత పాల్గొన్నారు.

ఉన్నతమైనది వైద్య వృత్తి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో ప్రతి ఒక్కరూ చేతులు జోడించేది ఇద్దరికేనని, ఒకరు భగవంతుడైతే మరొకరు వైద్యుడని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్ పేర్కొన్నారు. గుంటూరులో సోమవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్స్ డే నిర్వహించారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తి ఉన్నతమైన పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం తమ చేతుల్లోనే ఉందనే విషయాన్ని ప్రతి ఒక్క వైద్య విద్యార్థి గుర్తుంచుకోవాలని, తద్వారా రాబోవు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని తెలిపారు. ప్రముఖ సైకాలజిస్ట్ అండ్ మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల శ్రమను గుర్తెరిగి కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాల్ని సాధించవచ్చని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా వైద్య వృత్తి ఉత్తమమైనదని పేర్కొన్నారు.